




# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 7 సంచిక : 245

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

బుధవారం 7 ఫిబ్రవరి 2024


## ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు కృషి చేయాలి

● రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ ఛాన్స్ లర్ ఎస్. అబ్దుల్ నజీర్





**విజయవాడ,కలంకౌంటర్ :** ప్రజారోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిచ్చి ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు కృషి చేస్తోందని రాష్ట్ర గవర్నర్, డా.వై.ఎస్సార్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయ ఛాన్స్ లర్ ఎస్. అబ్దుల్ నజీర్ తెలిపారు. మంగళవారం విజయవాడ లోని "ది వెన్యూ కన్వెన్షన్ సెంటర్" లో డా.వై.ఎస్సార్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం 26వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విశిష్ట అతిథిగా విచ్చేసిన రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ ఛాన్స్ లర్ ఎస్. అబ్దుల్ నజీర్ అండర్ గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ లో వివిధ కోర్సుల్లో ప్రతిభ కనబర్చిన 60 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాతో పాటు మెడల్స్ , బహుమతులు ప్రదానం చేసి అభినందనలు తెలిపారు. ప్రపంచంతో పోటీ పడేలా విద్యార్థులను తీర్చిదిద్దిన అధ్యాపకుల కృషిని ప్రశంసించారు. డాక్టర్ ఆఫ్ సైన్స్(హానరీస్ కాసా) లో డా.వై.ఎస్సార్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ స్వీకరించిన బెంగుళూరులోని నిమ్హాన్స్ (నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ అండ్ న్యూరో సైన్సెస్) సైకియాట్రీ సీనియర్ ప్రొఫెసర్, డైరెక్టర్ డా. ప్రతిమా మూర్తిని గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ వైద్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజంలో వైద్యరంగానికి ప్రత్యేక గుర్తింపు ఉందని, నిరుపేదలకు ఉపయో గపడేలా సేవాభావంతో వైద్యసేవలు అందించాలని సూచించారు. వైద్య విద్యను అభ్యసిస్తున్నందుకు గర్వపడాలని, భవిష్యత్ లో కఠోర శ్రమ, పట్టుదల, నిజాయితీతో పనిచేయాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చే రోగికి చికిత్స అందించడమే కాదు రోగి కళ్లలో ఆనందం నింపి క్షేమంగా ఇంటికి పంపించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద పీట వేసిందన్నారు. ప్రస్తుత కాలంలో వైద్య సేవలే కాదు వైద్య విద్యను కూడా అందరికీ చేరువ చేసిందన్నారు. వైద్య రంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు సత్ఫలితాలిస్తున్నాయన్నారు. నాడు నేడు ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆధునికీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఆరోగ్యశ్రీ క్రింద చికిత్స వ్యయ పరిమితిని రూ.25 లక్షలకు పెంచడంతోపాటు 3,257 వైద్య ప్రక్రియలతో సహా అన్ని రకాల క్యాన్సర్ వ్యాధులకు ఎలాంటి వ్యయ పరిమితి లేకుండా ఉచితంగా చికిత్స అందించడం శుభ పరిణామమన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 53,126 మంది వైద్య సిబ్బందిని నియమించిందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న 11 మెడికల్ కాలేజీలకు అదనంగా 17 కొత్త మెడికల్ కాలేజీలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ఇప్పటికే 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రారంభించి తరగతులు కూడా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ తో ప్రజల ముంగిటకే వైద్య సేవలు అందిస్తోన్న ప్రభుత్వం అదనంగా 10,132 విలేజ్ హెల్త్ క్లినిక్ లు, 1,142 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 177 కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, 53 ఏరియా ఆస్పత్రులు, 12 జిల్లా ఆస్పత్రులు, 11 టీచింగ్ హాస్పిటల్స్, 15 స్పెషాలిటీ హాస్పిటల్స్, 542 అర్బన్ పీహెచ్ సీలతో రోగుల ఆరోగ్యానికి భద్రత,



భరోసా కల్పిస్తోందన్నారు. డా.వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ అండ్ సైన్సెస్ పరిధిలోని 439 కళాశాలల్లో మెడికల్, డెంటల్, ఆయుర్వేదం, హోమియోపతి, యునాని, నేచురోపతి, యోగా, నర్సింగ్, ఫిజియోథెరపీ, ఇతర అనుబంధ పారామెడికల్, ఆరోగ్య విజ్ఞాన కోర్సులను అభ్యసిస్తున్న వేలాది మంది విద్యార్థులు భవిష్యత్ లో ప్రజలకు వైద్యసేవలు అందించాలని సూచించారు. తాము చదువుకున్న విశ్వవిద్యాలయానికి సమాజంలో కీర్తిప్రతిష్టలు తీసుకొస్తారని విశ్వసిస్తున్నానన్నారు. మందులు వ్యాధులను మాత్రమే నయం చేస్తాయి కానీ రోగిని నయం చేసేది మాత్రం వైద్యుడే అని ఈ సందర్భంగా గుర్తుచేశారు. భవిష్యత్ లో అందరూ ఉన్నతంగా రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని గవర్నర్ కాంక్షించారు. బెంగుళూరులోని నిమ్హాన్స్ (నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ అండ్ న్యూరో సైన్సెస్) సైకియాట్రీ సీనియర్ ప్రొఫెసర్, డైరెక్టర్ డా. ప్రతిమా మూర్తి డాక్టర్ ఆఫ్ సైన్స్(హానరీస్ కాసా) లో గౌరవ డాక్టరేట్ స్వీకరించిన అనంతరం స్నాతకోత్సవ ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా గౌరవ డాక్టరేట్ అందించినందుకు గవర్నర్ కు, యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్, పాలక వర్గానికి ధన్యవాదాలు తెలిపారు. ఆరోగ్యకరమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె సూచించారు. ఏ రంగంలో అయినా నిరంతర జ్ఞానాన్వేషణ అవసరం అన్నారు. ప్రతి రోజూ నిత్యవిద్యార్థిగా ఉండాలని సూచించారు. డాక్టరేట్ లభించడం సంతోషకరమన్నారు. డా.వై.ఎస్సార్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం వైస్ ఛాన్స్ లర్ డా.కోరుకొండ బాబ్జి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో చేపట్టిన సంస్కరణలు అభినందనీయమన్నారు. యూనివర్సిటీకి సంబంధించిన ప్రతి సర్టిఫికెట్ ను విద్యార్థులకు ఆన్ లైన్ లో అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డా.వై.ఎస్సార్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం వైస్ ఛాన్స్ లర్ శ్రీ. డా.కోరుకొండ బాబ్జి, రిజిస్ట్రార్ డా.వేమిరెడ్డి రాధికా రెడ్డి, అకడమిక్ జాయింట్ రిజిస్ట్రార్ అజయ, రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ డైరెక్టర్ సుమిత శంకర్, జాయింట్ రిజిస్ట్రార్(ఎగ్జామినేషన్స్) పి. ప్రవీణ్ కుమార్, యూనివర్సిటీ పాలక వర్గ సభ్యులు, సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సుపరిపాలన అందించాం

● కఠినమైన పరిస్థితుల మధ్య అధికారంలోకి వచ్చాం ● కరోనాతో మూడేళ్లలో రాష్ట్రం రూ.66,116 కోట్లు నష్టపోయింది● విభజన కారణంగా ఏటా రూ.13 వేలకోట్లు నష్టం ● రూ.4.12 లక్షల కోట్ల అప్పులతో మన ప్రయాణం ప్రారంభించాం● గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

**గుంటూరు,కలంకౌంటర్ :** నోరు తెరిస్తే చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉన్నానని అంటారని, అనుభవం అనేది రాష్ట్రాలకు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని, ఏ అనుభవం లేకుండానే రాష్ట్రానికి సుపరిపాలన అందించామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో మంగళవారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై సీఎం జగన్ ప్రసంగిస్తూ గత 57 నెలల్లో జరిగిన మంచిని ప్రస్తావిస్తూనే చంద్రబాబు తీరను ఎండగట్టారు. ఇప్పటివరకు ఐదు బడ్జెట్ లు ప్రవేశపెట్టాం. ఇదే బడ్జెట్ కు మరిన్ని మెరుగులతో వచ్చే ప్రభుత్వంలో పెట్టుకుందాం. 2024 జూన్ లో మన ప్రభుత్వం ఏర్పడ్డాక పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడతాం. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై నిందలు వేస్తున్నాయి. కఠినమైన పరిస్థితుల మధ్య అధికారంలోకి వచ్చాం. ఇప్పటివరకు ఐదు ప్రజా బడ్జెట్లు ప్రవేశపెట్టాం. కరోనా కారణంగా ఆదాయం తగ్గింది. ఖర్చులు పెరిగాయి. గత ఐదేళ్లలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నాం. కరోనా తో మూడేళ్లలో రాష్ట్రం రూ.66,116 కోట్లు నష్టపోయింది. కరోనా వల్ల ఇతర రాష్ట్రాలు కూడా బాగా నష్టపోయాయి. మన దేశంలోని చాలా రాష్ట్రాలను ఈ పరిస్థితులు కుదిపేశాయి. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు కూడా తగ్గిపోయాయి. 2015-19 మధ్య కేంద్రం ఇచ్చిన పన్నుల వాటా 35 శాతం. ఈ ఐదేళ్లలో కేంద్రం ఇచ్చిన పన్నుల వాటా 31.5 శాతమే. ప్రతి ఏటా కేంద్రం నుంచి రావాల్సిన నిధులు తగ్గుతూ వచ్చాయి. గత ప్రభుత్వ విధానాల కారణంగా విద్య, వ్యవసాయం, మహిళా సాధికారత వంటి కీలక రంగాలు కుదేలయ్యాయి. రూ.87,612 కోట్ల రుణాలు మాఫీ చేస్తానని చెప్పి రైతులను చంద్రబాబు మోసం చేశారు. ఐదేళ్లలో రూ.15 వేల కోట్లు కూడా చంద్రబాబు రైతులకు ఇవ్వలేదు. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పి చంద్రబాబు మోసం చేశారు. ప్రతి రాష్ట్రానికి ఒక ఎకనమిక్ పవర్ హౌస్ ఉండాలి. అలాంటి పవర్ హౌస్ లేకపోతే రాష్ట్ర ఆదాయాలు ఎప్పటికీ పెరగవు. ఉమ్మడి ఆస్తిగా నిర్మించుకున్న హైదరాబాద్ ను కోల్పోయాం. రాష్ట్ర విభజన తర్వాత ఇప్పటికీ రెవెన్యూ లోటు వెంటాడుతోంది. అందుకోసమే విశాఖ గురించి పదేపదే చెప్తున్నా విభజన కారణంగా రాష్ట్రం ఏటా రూ.13 వేలకోట్లు నష్టపోతున్నాం. లక్షా 30 వేల కోట్లు అదనపు ఆదాయాన్ని కోల్పోయాం. మనకు ఆ వెసులుబాటు లేకుండా చేశారు. కనీసం చట్టంలోనూ ఆ వెసులుబాటు కల్పించలేదు. అందుకే కేంద్రంలో ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రావొద్దని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. 57 నెలల మన ప్రయాణంలో ఎక్కడా అవినీతికి తావివ్వలేదు. లంచాలు, వివక్ష లేకుండా పారదర్శక పాలన చేశాం. ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి



రూపాయి ప్రజలకు చేరుతోంది. రూ.2 లక్షల 55 వేల కోట్లు పేదల ఖాతాల్లో వేశాం. బటన్ నొక్కి నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో డబ్బులేస్తున్నారు. నాన్ డీబీటీ ద్వారా రూ.లక్షా 76 వేల కోట్లు అందించాం. ఎల్లో మీడియా ఒకే అబద్ధాన్ని పదేపదే చెప్తోంది. ఇలాంటి వారిపై మనం యుద్ధం చేస్తున్నాం. చంద్రబాబు హయాంలో కంటే అభివృద్ధి కోసం మేం అదనంగా ఖర్చు చేస్తున్నాం. చంద్రబాబు హయాంలో ఏడాదికి సగటున రూ.15,227 కోట్లు ఖర్చు చేస్తే మా హయాంలో ఏడాదికి రూ.17,757 కోట్లు ఖర్చు చేశాం. అప్పులపై ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తోంది. ఎక్కువ అప్పులు చేశామని అబద్ధాల బ్యాచ్ ప్రచారం చేస్తోంది. విభజన నాటికి లక్షా 53 వేల కోట్ల అప్పు ఉంటే చంద్రబాబు దిగిపోయే సమయానికి 4.12 లక్షల కోట్లకు చేరింది. రూ.4.12 లక్షల కోట్ల అప్పులతో మన ప్రయాణం ప్రారంభించాం. చంద్రబాబు హయాంలో అప్పులు రూ.4,12,288 కోట్లు చంద్రబాబు హయాంలో అప్పులు 21.87 శాతం పెరిగితే మన హయాంలో అప్పుల పెరుగుదల 12 శాతానికి పరిమితం చేశాం. 14 ఏళ్ల చంద్రబాబు హయాంలో ఒక్కరికీ మంచి చేసింది లేదు. మన పాలనలో అందరికీ సంక్షేమం అందించాం. బాబు హయాంలో అక్కచెల్లెమ్మలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. మనం అక్కచెల్లెమ్మల ఖాతాలో రూ.2 లక్షల 55 వేల కోట్లు వేశాం. పేదలకు అండగా నిలబడ్డాం. ప్రతి రూపాయిని బాధ్యతగా ఖర్చు చేశాం. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాం. చంద్రబాబుకు ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేదు. చంద్రబాబు పొత్తులకోసం వెంపర్లాడుతున్నారు. జాతీయ పార్టీలతో కూడా పరోక్షంగా, ప్రత్యక్షంగా అంటకాగుతున్నారు. చంద్రబాబు మళ్లీ మోసపూరిత వాగ్దానాలు ఇస్తున్నాడు. చంద్రబాబు మూడుసార్లు సీఎం అయినా ప్రజలకు చేసిందేమీ లేదు. ఇప్పటికీ బాబు ఏంచేశాడో చెప్పి ఓటు అడగలేకపోతున్నాడు.

## నన్ను.. నా పార్టీని టచ్ చేసి చూడు

● సీఎం రేవంత్‌కు కేసీఆర్ ఛాలెంజ్

**హైదరాబాద్,కలంకౌంటర్ :** తెలంగాణ ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ప్రాజెక్టులను కేంద్రం ఆధీనంలోకి వెళ్లేలా చేస్తున్నారంటూ గులాబీ నేతలు మండిపడుతున్నారు. తాజాగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం ఈ అంశానికి సంబంధించి కాంగ్రెస్ సర్కార్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం కృష్ణా పరివాహక ప్రాంతం నేతలతో కేసీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేసీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేంద్రం ఎంత ఒత్తిడి తెచ్చిన 10 ఏళ్లలో ఏనాడూ తెలంగాణ ప్రాజెక్టులు అప్పగించలేదని అన్నారు.

**ఆనాడే చెప్పిన...** "ప్రాజెక్ట్‌లు మాకు అప్పగించాలని లేదంటే మేమే నోటిఫై చేస్తామని కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ శకావత్ నన్ను బెదిరించారు. కావాలంటే తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెట్టుకో... నా ప్రభుత్వాన్ని రద్దు చేస్తా... తెలంగాణకు అన్యాయం చేస్తా అంటే అస్సలే ఊరుకోను.. ప్రాజెక్టులు అప్పగించే ప్రసక్తే లేదని ఆనాడే చెప్పిన. నన్ను వ్యక్తిగతంగా, బీఆర్ఎస్ పార్టీని కొత్త సీఎం ఇష్టం వచ్చినట్లు తిడుతున్నారు. నన్ను ...నా పార్టీని టచ్ చేయడం నీతో కాదు... నీ కంటే హేమా హేమీలనే ఎదుర్కొన్న చరిత్ర మాకున్నది.. రాష్ట్రాన్ని పదేళ్లు పదిలంగా కాపాడుకున్నం... దాన్ని పరాయి వాళ్ల పాలు చేస్తున్నారు. తెలంగాణ కోసం కేసీఆర్ ఏనాడూ వెనక్కు పోడు... ఉడుత బెదిరింపులకు భయపడను... ముందు ముందు ఏందో చూద్దాం...



తెలంగాణ ప్రయోజనాల కోసం ఏం చేయాలో నాకు బాగా తెలుసు" అంటూ కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు..

## వైసీపీ పెత్తందారుల ముందు దళితుల ఆత్మగౌరవానికి భంగం

● దళిత ఎమ్మెల్యేలకే ట్రాన్స్ ఫర్లు..నోరెత్తితే సీట్లు రద్దు ● ఈసీ కార్యాలయంలో డేటా చోరీపై సీబీఐ విచారణ జరపాలి● ఊరూరా విధ్వంసమే రాష్ట్రంలో జగన్ మార్క్● జె బ్రాండ్స్ తరిమేసి మద్యం ధరలు నియంత్రిస్తాం● జగన్ కు పులివెందులలోనే దిక్కులేదు...కుప్పంలో వేలు పెడతాడా? ● జీడీ నెల్లూరు రా...కదలిరా బహిరంగ సభలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు





**చిత్తూరు జిల్లా జీడీనెల్లూరు,కలంకౌంటర్ :** పులివెందులలోనే జగన్ ఫ్యూజ్ కాలిపోయింది. వైసీపీ నుండి పోటీ చేయడానికి అభ్యర్థులే దొరకడం లేదు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి ప్రభంజనానికి ఫ్యాన్ రెక్కలు ముక్కలవటం ఖాయం. చిత్తూరు జిల్లాలో మీ మధ్యే పెరిగా. రాజకీయాల్లో ఎవరికీ దక్కని గౌరవం నాకు దక్కిందంటే అది మీ వల్లే. ఎర్రచందనం స్మగ్లింగ్ చేసేవారిని, అవినీతికి పాల్పడే వారిని హెచ్చరిస్తున్నా..ఇక రెండు నెలలే మీ బాగోతం. తర్వాత మీ పరిస్థితి ఏంటో ఆలోచించుకోండి. నా చిన్నతనంలో గ్రామాల్లో కరెంట్ ఉండేది కాదు. ఒక ముఖ్యమంత్రిగా విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చా. సోలార్, గాలితో నేడు కరెంట్ ఉత్పత్తి అవుతోంది. నేడు డ్రైవర్ లెస్ కార్లొచ్చాయి. సంస్కరణల వల్ల సంపద పెరుగుతుంది. పెరిగిన సంపద పేదలకు అందాలి. పేదరికం లేని సమాజం చూడాలన్నదే నా జీవిత లక్ష్యం. హైదరాబాద్ ను నాడు ఐటీ హబ్ గా అభివృద్ధి చేశా. జగన్ రెడ్డి రాష్ట్రానికి పట్టిన శనిగ్రహం. అందుకే రాతియుగం వైపు పోకుండా స్వర్ణయుగం వైపు రావాలని రా..కదలిరా అని పిలుపునిచ్చారు.

**వాలంటీర్లు వైసీపీకి సేవ చేస్తే వదిలిపెట్టం..** ఓడిపోతాడని జగన్ రెడ్డి మానసిక రోగంతో బాధపడుతున్నారు. సిద్ధం అంటూ అవినీతి సొమ్ముతో పెద్దపెద్ద కటౌట్లు పెట్టాడు. కానీ జగన్ ని ఓడించి ఇంటికి పంపేందుకు జనం సిద్ధంగా ఉన్నారు. సిద్ధం అని కటౌట్ చూసినప్పుడు ఉపాధి లేక వలసలు, పెరిగిన ధరలు, బడుగు బలహీనవర్గాలపై దాడులతో పాటు ప్రభుత్వం మిమ్మల్ని పెట్టిన ఇబ్బందులన్నీ గుర్తుకు రావాలి. ఇతను మాకు వద్దు అని ఛీ కొట్టాలి. ఎన్నికల వరకు మీరంతా స్వర్ణయుగం కోసం కష్టపడండి. ఎన్నికల్లో మీరు బటన్ నొక్కితే జగన్ రెడ్డి మైండ్ బ్లాంక్ అవ్వాలి. దానికి మీరు సిద్ధమా? జగన్ ని నమ్ముకుంటే వాలంటీర్లు జైలుకెళ్లక తప్పదు. టీడీపీ వస్తే వాలంటీర్లను తొలగిస్తామని జగన్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వాలంటీర్లు ప్రజలకు సేవ చేస్తే మేం వ్యతిరేకించం..కానీ వైసీపీకి సేవ చేసేవారిని వదిలిపెట్టం. వాలంటీర్లతో జగన్ తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. జగన్ వల్ల రాష్ట్రం ఎలా నష్టపోయిందో ప్రతి ఇంటికి వెళ్లి మీరే వివరించాలి. మీరే నాకు స్టార్ క్యాంపెనయిర్లు. జగన్ మార్క్ అంటూ కొత్తగా ప్రచారం మెదలు పెట్టారు.

## వైసీపీ ఎర్ర చందనం మాఫియా దారుణాలకు పరాకాష్ఠ



● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్

**గుంటూరు,కలంకౌంటర్ :** అన్నమయ్య జిల్లాలో ఎర్ర చందనం స్మగ్లర్లను అడ్డుకున్న టాస్క్ ఫోర్స్ కానిస్టేబుల్ గణేశ్ ఆ ప్రయత్నంలో ప్రాణాలు కోల్పోయిన ఘటనపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ఎర్రచందనం స్మగ్లర్లు తమ వాహనంతో కానిస్టేబుల్ గణేశ్ ను ఢీకొట్టారు. ఆసుపత్రికి తరలిస్తుండగా కానిస్టేబుల్ గణేశ్ మృతి చెందాడు. ఈ ఘటన నేపథ్యంలో నారా లోకేశ్ భగ్గుమన్నారు. అన్నమయ్య జిల్లా కె.వి.పల్లి మండలంలో కూంబింగ్ నిర్వహిస్తున్న టాస్క్ ఫోర్స్ పోలీసులపై మెరుపుదాడులకు పాల్పడి, కానిస్టేబుల్ గణేశ్ ని చంపేయటం రాష్ట్రంలో వైసీపీ ఎర్ర చందనం మాఫియా దారుణాలకు పరాకాష్ఠ అని ధ్వజమెత్తారు. జగన్ పాలన ఎర్రచందనం స్మగ్లర్ల పాలిట స్వర్ణయుగమైంది. పుంగనూరు వీరప్పన్ పెద్దిరెడ్డి, అంతర్జాతీయ స్మగ్లర్ కొల్లం గంగిరెడ్డి ప్లానింగ్ తో వైసీపీ ఎర్ర చందనం మాఫియా అవతారం ఎత్తింది. ఎర్రచందనం స్మగ్లర్లను పార్టీ అభ్యర్థులుగా ప్రకటించిన జగన్ ఎర్ర చందనం స్మగ్లింగ్ కి గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేశాడు. అడ్డొచ్చిన పోలీసుల్ని వైసీపీ ఎర్ర చందనం మాఫియా చంపేస్తోంది. టాస్క్ ఫోర్స్ పోలీసు వాహనాలనే ఢీకొట్టి కానిస్టేబుల్‌ని చంపేశారంటే సర్కారీ పెద్దల అండదండలతో ఎంతగా బరితెగించారో అర్థం చేసుకోవచ్చు. విధినిర్వహణలో పాలకుల మాఫియాకి బలైన కానిస్టేబుల్ గణేశ్ కి నివాళులు. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. గణేశ్ కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి. గణేశ్ ని అత్యంత కిరాతకంగా చంపేసిన ఎర్ర చందనం మాఫియాను కఠినంగా శిక్షించాలని నారా లోకేశ్ డిమాండ్ చేశారు.

## కొడాలి నాని ని మర్యాదపూర్వకంగా కలిసిన ఈ ఎస్



**గుడివాడ,కలంకౌంటర్ :** కృష్ణాజిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఏ.ఆవులయ్య ఎమ్మెల్యే కొడాలి నానిను ఆయన స్వగృహంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నూతన సూపర్డెంట్ ఆవులయ్యతో ఎమ్మెల్యే నాని కొద్దిసేపు మాట్లాడారు. మాదకద్రవ్య రహిత ప్రాంతంగా ఏపీను తీర్చి దిద్దడంలో సీఎం జగన్ చేస్తున్న కృషిలో పోలీస్,సెబ్ శాఖల సమన్వయంతో జిల్లాలో ఎక్సైజ్ శాఖ భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే నాని సూచించారు. అక్రమ మద్యాన్ని నియంత్రించడంలో సచివాలయ మహిళా పోలీసుల సేవలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కొడాలి నాని సూపర్డెంట్ ఆవులయ్యతో అన్నారు.

## నాలుగో విడత ఆసరా కార్యక్రమంలో కొడాలి నాని



**గుడివాడ,కలంకౌంటర్ :** గుడివాడ టౌన్, రూరల్ మండలాల పరిధిలో నాలుగో విడత ఆసరా కార్యక్రమం గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం ప్రాంగణంలో వేలాదిమంది సమక్షంలో మంగళవారం జరిగింది.మండల పరిధిలో గల 698 గ్రూపులలోని 6వేల,932 మంది సభ్యులకు విడుదలైన 5కోట్ల,62లక్షల,16వేల,923 రూపాయల ఆసరా జంబో చెక్కును ప్రజా ప్రతినిధులు, డ్వాక్రా సభ్యులతో కలిసి ఎమ్మెల్యే కొడాలి నాని ఆవిష్కరించారు. తొలుత మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా సమైక్య నేతలు స్వర్గీయ వైయస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కొడాలి నానితో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకాలు నిర్వహించారు.

## ప్రజాదీవెన కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్న ఉప్పాల రాము..



**పెడన (కృష్ణా జిల్లా),కలంకౌంటర్ :** పెడన మండలం పెనుమల్లి గ్రామంలో "ప్రజా దీవెన" కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రతి గడపను సందర్శిస్తూ ప్రతి ఒక్కరిని కలిసి మద్దతు ఇవ్వాలని కోరిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెడన నియోజకవర్గ శాసనసభ అభ్యర్థి ఉప్పాల రాము. ఈసందర్భంగా ఉప్పుల రాము మాట్లడుతూ మీ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి మరొక్కసారి ముఖ్యమంత్రిగా వై.యస్ జగన్మోహన్ రెడ్డి ని , శాసనసభ్యుడిగా నన్ను గెలిపించాలని కోరారు. ప్రతి ఒక్కరి సమస్యను తెలుసుకుని గెలిచాక తప్పక తీరుస్తానని ఈసందర్భంగా భరోసా ఇచ్చారు.

## ఎస్ టీ యూ రాష్ట్రోపాధ్యాయా సంఘం వార్షిక సమావేశం



**పిట్టలవాని పాలెం(బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** రాష్ట్రోపాధ్యాయ సంఘం STU బాపట్ల జిల్లా 77వ వార్షిక కౌన్సిల్ సమావేశం బాపట్లలో జరిగింది. ఈ కౌన్సిల్ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా గుడివాడ అమరనాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారనీ ఎస్ టి యు పిట్టలవానిపాలెం మండల శాఖ అధ్యక్షులు ఈమని సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. గత 22 సంవత్సరాలుగా సంఘానికి విశేషమైన సేవ చేసిన ఫలితంగా ఈ పదవికి ఎంపిక చేశారు అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన గుడివాడ అమరనాథ్ మాట్లాడుతూ విద్యారంగ సమ-స్యల పట్ల అవగాహన కలిగి, ఉపాధ్యాయ సమస్యల పట్ల నిబద్ధతతో పోరాటం చేస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించవలసిన ఆర్థిక బకాయిలు, పెండింగ్ డిఏ లు వెంటనే చెల్లించాలని, సిపిఎస్ జిపిఎస్ విధానాలను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, మధ్యంతర భృతి ప్రకటించాలని, డీఎస్సీలో పోస్టులు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మండలానికి చెందిన గుమ్మడి కాంచనరావు జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారన్నారు. ఉపాధ్యాయులకు సేవలు అందించడంలో ఎస్టియు అగ్రభాగాన ఉందని మండల ప్రధాన కార్యదర్శి గాదె రమేష్ బాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ టి యు మండల కార్యవర్గ సభ్యులు కుంచాల శ్రీనివాసరావు, డి.నానిబాబు, ఎల్ శివ ప్రసాద్, మండే ప్రభాకర్ రావు, ఎం రాజలక్ష్మి తదితరులు అభినందనలు తెలిపారు.

# నిరుద్యోగుల దీక్ష కు కొనకళ్ళ మద్దతు






**అవనిగడ్డ,కలంకౌంటర్ :** దగాపడ్డ డైట్,బి ఈ డి విద్యార్థులుకు అండగా వందలాదిమంది డిఎస్సి అభ్యర్థులతో అవనిగడ్డ గాంధిక్షేత్రంలో మాజీ ఉపసభాపతి అవనిగడ్డ టీడీపీ ఇంచార్జి మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టిన ఒకరోజు దీక్ష కార్యక్రమంలో పాల్గొని సంఘీభా వం తెలియచేసిన కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ బందరు పార్లమెంట్ సభ్యులు కొనకళ్ళ నారాయణరావు , తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చిన్నబాబు , టీడీపీ యువనాయ కులు మండలి వెంకట్ రామ్ , హసీం బేగ్, తెలుగుదేశం పార్టీ-జనసేన నాయకులు.

## పట్టణ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షులు కార్యకర్తల సమావేశం







**గుంటూరు,కలంకౌంటర్ :** పట్టణంలోని ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలో వున్న 16,26,27,,40, 41,46,47,48, డివిజన్ల అధ్యక్షుల తో, జనసైనికులతో గుంటూరు పట్టణ జనసేన పార్టీ కార్యాలయంలో 8 డివిజన్ల సమావేశం నిర్వహించారు . ఈ సమావేశానికి గుంటూరు పట్టణ జనసేన పార్టీ అధ్యక్షులు నేరేళ్ళ సురేష్ అధ్యక్షత వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథిలుగా ప్రత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త కోర్రపాటి నాగేశ్వరరావు, ప్రత్తిపాడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి బూర్లె రామాంజనేయులు , పొన్నూరు నియోజకవర్గం సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు హాజర య్యారు.. ఈసందర్భంగా నేరేళ్ళ సురేష్ 8 డివిజన్ల అధ్యక్షుల ను రామాంజనేయులు కి పరిచయం చేసారు . ఈసందర్భంగా రామాం జనేయులు మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఉన్న ఈ 8 డివిజన్ల పరిధిలోని అధ్యక్షులు ప్రతి డివిజన్ లోని తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ ముఖ్య నాయకులతో ఒక కమిటీని ఏర్పాటు చేసు కోని ఆ డివిజన్లో రెండు పార్టీల మధ్య ఏకాభిప్రాయం తో ఇరువురు కలిసి రెండు పార్టీల మానిఫెస్ట్, విధివిధానాలను ప్రజలకు వివరించి ప్రజలను చైతన్యపరిచే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త కోర్రపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ అన్ని డివిజన్లలో ప్రస్తుతం ఓటర్ లిస్టు లో వున్న తప్పొప్పుల వెరిఫికేషన్,నూతన ఓటర్లుగా నమోదు కార్యక్ర మంలో జనసైనికులు చాలా బాగా పనిచేస్తున్నారని అన్నారు. పొన్నూ రు నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త వడ్రాణం మార్కం డేయ బాబు మాట్లాడారు . పట్టణ అధ్యక్షులు నేరేళ్ళ సురేష్ మాట్లాడు తూ డివిజన్ పరిధిలోని రెండు పార్టీల కార్యకర్తలు,నాయకులు, వీరమహిళలు, జనసైనికులు కలిసికట్టుగా ముందుకు నడవాలని ఏలాంటి ఒడుదోడుగులు లేకుండా విజయమే లక్ష్యంగా చేసుకుని ప్రయాణం చేయాలన్నారు . రానున్న ఈ ఎన్నికల సమరంలో శక్తి వంచన లేకుండా కృషి చేయాలని సురేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పు వెంకటర త్తయ్య, గుంటూరు జిల్లా ఆధికార ప్రతినిధి ఆళ్ళ హరి ,గుంటూరు పట్టణ ఉపాధ్యక్షులు చింతా రేణుకా రాజు, కార్పొరేటర్లు దాసరి లక్ష్మి దుర్గ,యర్రంశెట్టి పద్మావతి, డివిజన్ల అధ్యక్షులు వీరమహిళలు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా వాసవి క్లబ్ చేస్తున్న సేవలు ఎనలేనివి - దేవకి







**తిరుమల, కలంకౌంటర్ :** దేశవ్యాప్తంగా వాసవి క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని వాసవి సత్ర సముదాయాల అధ్యక్షులుదేవకి వెంక టేశ్వర్లు అన్నారు.తిరుమల మౌనస్వామి మఠంలో వాసవి క్లబ్ ఇంట ర్నేషనల్ మొదటి ఎగ్జిక్యూటివ్ కాన్ఫరెన్స్ మంగళవారం ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవిచంద్రన్, వైస్ ప్రెసిడెంట్ ఇరుకుల రామకృష్ణ ఆధ్వ ర్యంలో ఎంతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅ తిథిగా వాసవి సత్ర సముదాయాల అధ్యక్షులుదేవకి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవకి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వాసవి వాసవి క్లబ్ చేస్తున్న సేవలు ఎనలేనివి అని దేవకి అన్నారు. వాసవి క్లబ్ ప్రోటోకాల్ ప్రకారం ప్రతి ఒక్కరిని గౌరవిస్తారని అన్నారు. ఇప్పుడు జరిగే విధంగానే వాసవి క్లబ్ ల సేవలు కొనసా గించాలని దేవకి అన్నారు. ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవిచంద్రన్,వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ ల ఆధ్వర్యంలో వాసవి క్లబ్ సేవలు మరింత విస్తృతంగా జరగాలని, వాసవి క్లబ్ కుమీరు సారధ్యంలో మరింత మంచి పేరు తీసుకుని రావాలని దేవకి ఆకాంక్షించారు. అనంతరం దేవకి వెంకటేశ్వర్లు ను వాసవి క్లబ్ వారు ఘనంగా సన్మానించడంజరిగింది. ఈ కార్యక్రమంలో మహాసభ ఎక్స్ ప్రెసిడెంట్ కె నాగబాబు,ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవిచంద్రన్,వైస్ ప్రెసిడెంట్ ఇరుకుల రామకృష్ణ,సెక్రటరీ నాగభూషణం,మాజీ అధ్యక్షులు పి గాయత్రి,అయితా రాములు,గంపా నాగేశ్వరరావు,ఏ.వెంకటేష్,పి సుదర్శన్,ముత్యాల శంకర్,వంకదార వాసుదేవరావు,నూలి వెంకట రమణమూర్తి,ఏవీఎస్ఎన్ గుప్తా,తదితరులు పాల్గొన్నారు.

## పేదరికం వల్ల ఏ ఒక్కరికీ చదువు దూరం కారాదు : దిరిశం పద్మజ్యోతి

**తిరువూరు,కలంకౌంటర్ :** దిరిశం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విన్నర్స్ కోచింగ్ సెంటర్ నందు 50 మంది పేద విద్యార్థులకు కాంపిటేటివ్ కోచింగ్ ఇప్పించారు. కోచింగ్ తీసుకున్న విద్యార్థులలో ఒక్కరైనా కల్లేపల్లి నవీన్ ఎస్ ఐ గా ఎంపికయ్యారు. సెలెక్ట్ అయిన విద్యార్థి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సహాయం చేసిన తిరువూరు మాజీ ఎమ్మెల్యే దిరిశం పద్మజ్యోతి, సుధాకర్ దంపతులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు . ఎస్ ఐ జాబ్ సాధించిన కల్లేపల్లి నవీన్ ను పద్మజ్యోతి దంపతులు సన్మానించి ఉన్నత శిఖరాలకు అవరోదించాలని ఆకాంక్షించి నియోజకవర్గంలో ఇలాంటి పేద విద్యార్థులకు ఇంకా మా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సహాయం చేసి వారు మంచి ఉద్యోగాలు పొందటానికి తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.

## తిరువూరు నగరపంచాయతీ లో అధికారపార్టీ వైసీపీకి భారీ షాక్ తగిలింది.

**తిరువూరు,కలంకౌంటర్ :** ముస్లిం మైనార్టీ కి చెందిన పలువురు నాయకులు,బీసీ కమ్యూనిటీ కి చెందినవారు మొత్తం 70 కుటుంబాలు విజయవాడ పార్లమెంట్ తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరిక పట్టణంలో వైసీపీ బలంగా ఉండి రెండో వార్డు మున్సిపల్ వైస్ చైర్మన్ గా ఉన్న వార్డు నుండి టీడీపీలో చేరికలపై తీవ్ర కలవరపాటుకు గురైన అధికార పార్టీ వైసీపీలో కష్టపడి పనిచేసిన తమకు గుర్తింపు లేకపోగా, అవమానాలు ఎదుర్కొన్నామని పార్టీలో చేరిన వారు పేర్కొన్నారు. మైనార్టీ,బీసీలకు ఏదైనా సంక్షేమ పథకాలు,సబ్సిడీ లోన్లు,రంజాన్ తోఫా, షాధి ముబారక్ వంటివి గతంలో మాకు అందాయని కానీ ఈ ప్రభుత్వంలో మాకు మొండి చెయ్యే ఎదురయ్యిందని అన్నారు. ప్రజలకు మంచి జరిగిందంటే ఒక్క టీడీపీలోనే అని అందుకే తెదేపా తీర్థం పుచ్చుకున్నామని స్పష్టం చేశారు. కేశినేని చిన్ని ఆధ్వర్యంలో పార్టీ బలోపేతం అయ్యిందని వారి సారథ్యంలో టీడీపీ పార్టీలో చేరడం సంతోషకరమని వారు తెలిపారు. కేశినేని చిన్నికి కార్యకర్తలు వివిధ రకాల గజమాలలతో ఘనంగా సత్కరించారు.

## పమిడిముక్కల ఎస్సైగా కుడిపూడి శ్రీనివాసు



| Sl. No. | Rank & Genl. No. | Name of SI (Civil) S/Sri | Present working unit | Posted To |
|---|---|---|---|---|
| 1. | Direct SI 4310 | K.Srinivasu | Ghantasala | SHO, Pamidimukkala PS |

**ఘంటసాల,కలంకౌంటర్ :** ఘంటసాల మండలం పోలీసు స్టేషన్ ఎస్సైగా పనిచేసిన కుడిపూడి శ్రీనివాసు పమిడిము క్కల మండలం పోలీసు స్టేషన్ ఎస్సైగా బదిలీ చేస్తూ మంగళవారం ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

## ఆర్టీసీ డిపో మేనేజర్ పై కేసు కొట్టివేత..

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కులం పేరుతో దూషించారని, వేధించారని ఆర్టీసీ డిపో మేనేజర్ పై మహిళా కండక్టర్ పెట్టిన కేసును విచారణ అనంతరం కొట్టివేస్తూ కృష్ణాజిల్లా పదోవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి వి.నరసింహమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. గతంలో గుడివాడ ఆర్టీసీ డిపో మేనేజర్ గా పనిచేసి ప్రస్తుతం అనంతపురం జిల్లా ఉరవకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ గా పనిచేస్తున్న చుండి బాలాజీ దయాల్ (55)పై గుడివాడ ఆర్టీసీ డిపోలో మహిళా కండక్టర్ గా పని చేస్తున్న బట్టు స్వాతి(30) ఇతర మహిళ కండక్టర్లు తో కలిసి 2020 ఫిబ్రవరి నెలలో ఎస్సీ ఎస్టీ చట్టప్రకారం ఫిర్యాదు చేయగా ఆ కేసును అప్పటి మచిలీపట్నం డి.ఎస్.పి, ఎండి. మహబూబ్ బాషా దర్యాప్ చేశారు. 18 మంది సాక్షులతో చార్జ్ షీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో ప్రాసిక్యూషన్ తరపున విచారించిన సాక్షులు చెప్పిన సాక్ష్యం ప్రకారం నిందితులపై నేరం రు జువు కాకపోవడంతో న్యాయమూర్తి కేసు కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. నిందితుడు తరపున న్యాయవాదులు లంకిశెట్టి బాలాజీ, కమిలి విజయ్ కుమార్, మద్దాల సువర్ణ రాజు కేసు వాదించారు

## ఆధ్యాత్మిక కమిటీ వైస్ చైర్మన్ గా చిట్టా ప్రసాద్



**అవనిగడ్డ,కలంకౌంటర్ :** కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘము నూతన కార్యవర్గంలో అవనిగడ్డ కు చెందిన ప్రముఖ వ్యాపారి సేవా తత్పరుడు చిట్టా ప్రసాద్ ఆధ్యాత్మిక కమిటీ వైస్ చైర్మన్ గా నియమితులయ్యారు.

## వాస్తు సందేహాలు... మార్చి నుంచి జాగ్రత్త!

జ్యోతిషశాస్త్రం ప్రకారం 2024 మార్చి నుండి మన ప్రపంచవ్యాప్తంగా చాలా అనర్ధదాయకంగా కనపడు తున్నది. ఈ కాలములో యుద్ధాలు, అనారోగ్యం బారి నపడతారు.ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాలు పోవును ఈ సంవత్సరంలో డబ్బును చాలా జాగ్రత్తగా ఖర్చుచేయగ లరు.మీ వద్ద ఉన్న ధనాన్ని దుర్వినియోగం చేయరా దు. మీ పెట్టుబడులు ఏదైనా లోహములో ( బంగా రం, వెండి , రాగి మొదలగు )పెట్టుబడులు పెట్టిన మంచి ఆదాయం వచ్చును.మరియూ భూమి కొనుగో లు చేసినా నష్టం లేకుండా. ఉండును. ఈ సంవత్స రం వ్యాపారులు. చేయుట మంచిది కాదు జాగ్రత అవసరం. భారత దేశంలో పుట్టడం మన అదృష్టం గా భావించాలి. మిగిలిన దేశాలు పతనం జరుగుతు న్నా మన దేశంలో కాస్త స్థిరత్వం ఉంటుంది ! ము ఖ్యంగా యూరోపియన్,అరబ్ దేశాలు బాగా నష్టపోతారు ! కావున తగు జాగ్రత్తలు అవసరం.



వి అనీల్ కుమార్
ప్రముఖ సిద్ధాంతి
సెల్..9603304404

## మంగళగిరి నియోజకవర్గంలో నిజం గెలవాలి



**గుంటూరు,కలంకౌంటర్ :** మంగళగిరి నియోజకవర్గంలో ప్రజలు భువనమ్మకు ఘన స్వాగతం పలికారు. పెదవడ్లపూడి గ్రామంలో భువనమ్మకు పెద్ద ఎత్తున గ్రామ మహిళలు సంఘీభావం తెలిపారు. తనకు సంఘీభావం తెలిపిన గ్రామస్తులు, నాయకులు, మహిళలకు భువనమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా బాపట్ల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి జన్మదిన వేడుకలు



**పిట్టలవాని పాలెం(బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** మండలంలోని కోమలి గ్రామంలో బాపట్ల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి జన్మదిన వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు అధిక సంఖ్య లో పాల్గొని కిషోర్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చెయ్యాలి..



**మల్కాపురం,కలంకౌంటర్ :** మొక్కలను నాటడం ద్వారా, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం ద్వారా ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో జరిగిన పర్యావం-ణ సదస్సులో ఆమె ముఖ్య వక్తగా మాట్లాడుతూ- మొక్కలను విరివిగా పెంచాలని, వాటి వల్ల ఆక్సిజన్ లభించడమే కాక కాలుష్యం తగ్గుతుందని అన్నారు. పచ్చదనానికి, పరిశుభ్రతకు, ఆహ్లాదకర వాతావరణానికి, టూరిజం అభివృద్ధి చెందడానికి, మానవాళి శ్రేయస్సుకు, ఆహార లబ్ధికి మొక్కల పెంపకం ఎంతో అవసరమని అన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై అధ్యాపకురాలు శ్రీమతి సలోమి ప్రసంగించారు. సదస్సులో భాగంగా విద్యార్థినులంతా మొక్కలను నాటారు .ప్లాస్టిక్ మంచినీటి సీసాలకు బదులుగా స్టీలు సీసాలను వాడడానికి సిద్ధపడి, వాటిని ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణకు విశేష కృషి చేస్తున్న అధ్యాపకురాలు శ్రీమతి సలోమి ని ఈ సందర్భంగా అంతా అభినందించారు.

## ఉలవపాడు నందు 46 వ వార్షికోత్సవ వేడుకలు



**ఉలవపాడు, కలంకౌంటర్ :** GVSM ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉలవపాడు నందు 46 వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రిన్సిపాల్ సయ్యద్ జిలానీ బాషా అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా GVSM ప్రభుత్వ హై స్కూల్ హెచ్ ఎం శివానాగేశ్వరరావు, హైస్కూల్ ఉపాధ్యాయులు సుధాకర్, సుధాకరబాబు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ శివశంకర రెడ్డి, చరిత్ర అధ్యాపకులు గారపాటి గోపీ చంద్ ప్రకాష్, కామర్స్ అధ్యాపకులు జ్యోతి, లైబ్రరీ సైన్స్ అధ్యాపకులు హనుమంతరావు, హిందీ అధ్యాపకులు రఫీ, వృక్ష శాస్త్ర అధ్యాపకులు గంగాభవాని, జంతు శాస్త్ర అధ్యాపకులు వెంకటేశ్వర్లు, ఫిజిక్స్ అధ్యాపకులు శ్రీనివాసులు, తెలుగు అధ్యాపకులు మాధవరెడ్డి విద్యార్థుల నుద్దేశించి జీవితంలో ఉన్నత స్థానానికి చేరాలంటే ఖాఠోర శ్రమ ద్వారా సాధ్యమని తెలిపారు.. అనంతరం ఆటలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ బహుమతులు అందచేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను అలరించాయి..

## ప్రాణాపాయ స్థితిలో ఉన్న పక్షిని కాపాడిన హోంగార్డ్..



**అమరావతి,కలంకౌంటర్ :** అసెంబ్లీకి బందోబస్తు వచ్చిన రాజమండ్రి కి చెందిన హోం గార్డ్ విధుల్లో ఉండగా అటువైపు గుర్తులేని వాహనం ఢీకొని పక్షికి గాయాలయ్యాయి. లేవలేని స్థితిలో దెబ్బతిని రోడ్డుపై పడి ఉంది. వెంటనే అది గమనించిన హోంగార్డ్ పక్షికి ప్రారంభోసి దాన్ని ఎగిరిపోవడానికి కృషి చేశారు మోహన్ రావు... అభినందించిన అధికారులు, సిబ్బంది...

# ప్రతి ఒక్క వాహనదారుడు తగు జాగ్రత్తతో వాహనమును నడుపవలెను - సబ్ కలెక్టర్ విద్యాధరి









**కందుకూరు,కలంకౌంటర్ :** ప్రతి ఒక్క వాహనదారుడు తగు జాగ్రత్తతో వాహనములు నడుపు వలెను అని సబ్ కలెక్టర్ విద్యాధరి వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. 35వ జాతీయ రహదారి మాసోత్సవాలలో భాగంగా మంగళవారం కందుకూరు లారీ ఓనర్ అసోసియేషన్ ఆఫీసు వద్ద లారీ ఓనర్లు, డ్రైవర్లు మరియు ఆటో డ్రైవర్లకు మ్యాక్సీ క్యాబ్ మోటర్ క్యాబ్ డ్రైవర్లకు రహదారి భద్రత పై అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కందుకూరు సబ్ కలెక్టర్ బి. విద్యాధరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ విద్యాధరి మాట్లాడుతూ రహదారి భద్రతపై అవగాహన సదస్సును లారీ ఓనర్స్ అసోసియేషన్ వద్ద ఏర్పాటు చేయటం చాలా అభినందనీయమని అదేవిధంగా ప్రతి ఒక్క వాహనదారుడు తగు జాగ్రత్తతో వాహనమును నడుపవలెనని, వాహనమును మనం ఎంత జాగ్రత్తగా నడిపినా ఎదురు వచ్చే వాహనదారుడు కూడా అదే విధంగా జాగ్రత్తగా వస్తేనే ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉంటాయని తెలియజేశారు. అలాగే గుడ్ సమర్ధన్ అంశం కరపత్రాలను ఆవిష్కరించి మెడికల్ క్యాంపు ను ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రాంతీయ సంయుక్త రవాణా కమిషనర్, గుంటూరు డాక్టర్ బి శ్రీకృష్ణవేణి మాట్లాడుతూ యొక్క రోడ్డు భద్రత మాసోత్సవములను ఆరు డిపార్ట్మెంట్లు కలిసి రోడ్డు భద్రత మాసోత్సవాలు జరుగుతారని, ప్రతి ఒక్క వాహనదారుడు తమవంతు బాధ్యతతో వాహనములను నడుపవలెనని, ప్రతి ఒక్క వాహనదారుడు ఎటువంటి ప్రమాదాలకు గురికాకుండా రోడ్ యాక్సిడెంట్స్ ను నివారించే దిశగా అడుగులు వేయాలని తెలియజేసి రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేపించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కావలి ప్రాంతీయ రవాణా శాఖ అధికారి వై సుధాకర్ రెడ్డి , నెల్లూరు ఎన్ఫోర్స్మెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ గోపి నాయక్ , కావలి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఆర్ సుందర్ రావు గారు, కందుకూరు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎస్.కె ఎండి రఫీ , కందుకూరు ఏరియా హాస్పిటల్ సూపరింటెంట్ ఎం శకుంతల , ప్రణవి ఐ హాస్పిటల్ డాక్టర్ శ్రీమతి ప్రశాంతి , డెంటల్ డాక్టర్ మధుసూదన్ రాజు , లారీ ఓనర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు , సెక్రటరీ గోపి మరియు రవాణాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మార్కాపురం నియోజకవర్గంలో "జయహో బీసీ" సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి వర్యులు,బీసీ విభాగం అధ్యక్షులు కొల్లు రవీంద్ర.....

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** రాబోయే నెలరోజుల్లో వైసిపి పార్టీ మొత్తం కాలి అయ్యి వాంటెడ్ బోర్డ్ లు పెట్టుకునే పరిస్థితి ఏర్పడబోతోంది.బీసీలను అక్రమ అరెస్టులు చేస్తే భయపడతావ్ అనుకున్నావేమో జగన్ రెడ్డి..భయం మా బీసీల బయోడేటా లోనే లేదు జగన్. నారా చంద్రబాబు గారి ఆదేశాల మేరకు గ్రామ గ్రామాన బీసీలకు చైతన్య పరిచే విధంగా జయహో బీసీ కార్యక్రమం చేపడుతున్నాం.జగన్ రెడ్డి ప్రభుత్వంలో బీసీలకు జరిగిన అన్యాయాలను వివరిస్తూ రాబోయే తెలుగుదేశం ప్రభుత్వం కల్పించే హక్కులను తెలియజేస్తున్నాం. 962 "జయహో బీసీ" సభలు ప్రతి మండలంలో ఒక సభ నిర్వహించడానికి ప్రణాళికను సిద్ధం చేసుకున్నాం.ఇప్పటికే 700 పైగా సమావేశాలు పూర్తి చేసుకున్నాం. భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు అయినా బీసీలకు మాత్రం అన్న నందమూరి తారకరామారావు ముఖ్యమంత్రి అయిన తర్వాతే స్వాతంత్రం వచ్చింది. బలహీన వర్గాల ప్రజలు బతికే హక్కు లేదా.... తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుల్ని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటా. మీకు అండగా తెలుగుదేశం పార్టీ నారా చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ ఉన్నారు.బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు,మైనార్టీలనే కాకుండా సొంత సామాజిక వర్గాన్ని కూడా నట్టేట ముంచాడు జగన్ రెడ్డి.. 2024లో తెలుగుదేశం – జనసేన ఉమ్మడి ప్రభుత్వం తథ్యం.. వందలాది బీసీలను పొట్టన పెట్టుకున్న రాక్షసుడు జగన్మోహన్ రెడ్డి. జగన్ రెడ్డి ప్రభుత్వంలో బీసీల ధనమాన ప్రాణాలకు రక్షణ లేదు. జగన్మోహన్ రెడ్డి అధికారం దిగిపోవడానికి "సిద్ధం" గా వున్నారు. అందుకే ముందుగా ప్రజలకి "సిద్ధం" సింబాలిగ్గా చెప్తున్నాడు. ప్రజలు గమనించాలి. బీసీల కోసం ప్రత్యేకమైన చట్టాన్ని తీసుకొచ్చే విధంగా నారా చంద్రబాబు రూపకల్పన చేస్తున్నారు. ఎన్నికలకు రెండు నెలల ముందు కులగణన పేరుతో రాజ్యాంగ ఇతర వాలంటీర్లను ఇంటింటికి తిప్పి వేలిముద్రలు వేయించుకుంటున్నారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తే మా టెంట్లను పీకేసి మమ్మల్ని అక్రమ అరెస్టు చేశారు. ఈ రాష్ట్రం కోసం అనునిత్యం పాటుపడే వ్యక్తిని అక్రమ అరెస్టు చేశారు. ఈ ప్రపంచంలో ఎంతోమందిని అరెస్టు చేశారు, కానీ ప్రపంచంలో ఏ నాయకుడికి రానంత స్పందన నారా చంద్రబాబుకి వచ్చింది.80 దేశాలకు పైగా రోడ్లపైకి వచ్చి ముక్తకంఠంతో వారు నిరసన



తెలియజేయడం ప్రపంచంలో ఏ నాయకుడికి దక్కని గౌరవం. అరటిపళ్ళు బండి దగ్గర మేక నమిలి నట్టు గుట్కా నములుతున్న కొడాలి నాని చంద్రబాబు కోసం మాట్లాడితే తరిమి తరిమి కొడతాం. పొద్దుటూరులో చేనేత వర్గానికి చెందిన నందం సుబ్బయ్య నీ అతి కిరాతకంగా చంపించారు. మాచర్లలో తోట చంద్రయ్యని జై జగన్ అని చెప్పమంటే లేదు జై చంద్రబాబు అని ప్రాణం విడిచాడు. రేపల్లెలో పసి బాలుడు అమర్నాథ్ గౌడ్ ని అతి కిరాతకంగా చంపిన వ్యక్తిని రోడ్డు మీద ఊరేగించారు. నిన్న కాక మొన్న మాచర్ల నియోజకవర్గంలో శ్రీకాకుళం నుంచి వేట కోసం వచ్చిన మత్స్యకార సోదరుడిని వైసిపి ఎమ్మెల్యే వేధింపులకు గురిచేసి ఆత్మహత్య చేసుకునే విధంగా చేశాడు. వచ్చేది తెలుగుదేశం – జనసేన ఉమ్మడి ప్రభుత్వమే.. చంద్రబాబును ఏ జైల్లో అయితే అక్రమంగా పెట్టించావో అదే జైల్లో అదే బ్లాక్ లో నిన్ను చిప్పకుడు తినిపించే రోజు అతి దగ్గరలోనే ఉంది జగన్ రెడ్డి.

## కేసుల కోసమే జగన్, విజయసాయి బీజేపీకి లొంగారు : మాణికం ఠాగూర్

**న్యూఢిల్లీ,కలంకౌంటర్ :** వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డిపై ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణికం ఠాగూర్ రాజ్యసభ ఛైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం రాజ్యసభలో మాట్లాడుతూ తనపై అసత్య ఆరోపణలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. లోక్‌సభ సభ్యుడి గురించి రాజ్యసభలో మాట్లాడటం సభా హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా హామీ ఇచ్చింది భారత ప్రధాన మంత్రి. ఆ హామీని అమలు చేయనందుకు ప్రధాని నరేంద్ర మోడీని విజయ సాయిరెడ్డి ప్రశ్నించడం లేదు. 2019 నుంచి దాదాపు అన్ని బిల్లులు జగన్ మద్దతుతోనే ఆమోదం పొందాయి. కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విపక్షాలన్నీ బహిష్కరిస్తే ఆయన మాత్రం హాజరయ్యారు. అన్ని ప్రజా వ్యతిరేక బిల్లుల ఆమోదానికి మద్దతుగా నిలిచారు. ప్రత్యేక హోదా సాధనకు 15 సార్లు అవకాశం వచ్చినా వైసీపీ చేజార్చుకుంది. సభలో బిల్లులకు మద్దతు ఇస్తారు. బయటికి వచ్చి వ్యతిరేకంగా మాట్లాడుతారు. జగన్ బీజేపీ కి ఏటీఎంలా మారారు. వీటన్నింటికి కారణం విజయసాయిరెడ్డి. కేంద్రానికి వైకాపా మద్దతుగా నిలవడం వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు. వారిద్దరి వ్యక్తిగత అవసరాలు, సీబీఐ కేసుల కోసం మాత్రమే బీజేపీకి లొంగిపోయారని మాణికం ఠాగూర్ విమర్శించారు.

## నిబంధనల ప్రకారం కాలువల నిర్మాణం చేపట్టాలి - సబ్ కలెక్టర్ విద్యాధరి



**కందుకూరు,కలంకౌంటర్ :** నిబంధనల ప్రకారం కాలువల నిర్మాణం చేపట్టాలని సబ్ కలెక్టర్ జి విద్యాధరి అన్నారు. స్థానిక బండపాలెం, శ్రీరామ్ కాలనీ లో నిర్మిస్తున్న ప్రధాన కాలువ ను మంగళవారం కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి పరిశీలించారు. నిర్మిస్తున్న కాలువను అధికారులు కొలతలు వేయకుండా ఏవిధంగా పనులు మొదలుపెట్టారని కాంట్రాక్టర్ను అడిగి తెలుసుకున్నారు. వెంటనే ముందు సర్వే చేసి కొలతలు వేసి నిబంధన ప్రకారం కాలవ నిర్మాణం చేపట్టాలని అధికారులను హెచ్చరించారు. రిపోర్ట్ వచ్చేంతవరకు కాల్వపనులను నిలిపివేయాలని సూచించారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆఫీస్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ



**విజయవాడ,కలంకౌంటర్ :** ఆఫీస్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీ 2024 ని మంగళవారం ఏపీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ కి అందించారు. ఈ సందర్భంగా ఎం డీ మాట్లాడుతూ ఆఫీసు సిబ్బందికి ఉపయోగకరమైన సమాచారంతో డైరీ ముద్రించి సభ్యులకు ఉచితంగా అందజేయడం అభినందనీయమన్నారు. ఆఫీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఓస్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శివప్రసాద్, రాష్ట్ర నాయకులు ఎంవి కొండారెడ్డి, కే. హరినాద్ రెడ్డి ,టీజే రావు , మధు పాల్గొన్నారు



**తిరువూరు పోలీస్ స్టేషన్ లో సెక్టర్ 1 ఎస్సైగా ఈరోజు బాధ్యతలు స్వీకరించిన కె.వి.జీ.వి సత్యనారాయణ.**

–తిరువూరు( ఎన్ టి ఆర్ జిల్లా ),కలంకౌంటర్ :

## అర్చక పురోహిత సంక్షేమ సంఘం సమావేశం





**మైలవరం,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అర్చక పురోహిత సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశం మైలవరంలో నిర్వహించారు .ఈ సమావేశానికి విశిష్ట అతిథులుగా ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేమూరి ఆనంద సూర్య, బ్రాహ్మణ కార్పొరేషన్ క్రెడిట్ సొసైటీ చైర్మన్ వి వి ఎ రామ కృష్ణ ప్రసాద్, సంఘ అధ్యక్షులు ఉపాధ్యక్షులు ప్రధాన కార్యదర్శి రాష్ట్ర కమిటీ సభ్యులు జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో బ్రాహ్మణ కార్పొరేషన్ కొనసాగించాలని ఒక ఆధ్యాత్మిక సంస్థ ద్వా రా ప్రభుత్వము అర్చక పురోహితులకు ఒక గుర్తింపు కార్డు ఇవ్వాలని తద్వారా ప్రముఖ దేవాలయాలు దర్శనానికి వెళ్ళినప్పుడు వీఐపీ దర్శనం కల్పించాలని అర్చక పురోహిత కుటుంబాలకు ఈ ఎస్ ఐ సౌకర్యము యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కల్పించాలని అదేవిధంగా క్రెడిట్ సొసైటీ ద్వారా ఇచ్చేటువంటి రుణాలకు వడ్డీ నీ సబ్సిడీ ద్వారా ప్రభుత్వం భరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అర్చక సంక్షేమ సంఘం అధ్యక్ష ఉపాధ్యక్ష కార్యదర్శులు విశిష్టతల వివరించారు.అనివార్య కారణాలవల్ల సభకు రాలేకపోయిన మాజీ మంత్రి ఉమామహేశ్వరరావు టెలిఫోన్ సందేశం వివరించారు..ఈ కార్యక్రమం లో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అర్చక ప్రవేశం సంఘం. అధ్యక్షులు వెలగలేటి సతీష్ కుమార్, ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ రాజా, ప్రధాన కార్యదర్శి అధికారుల కాళిదాసు, కోశాధికారి అంబటి సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న ఎంపీ వల్లభనేని బాలశౌరి

● ర్యాలీలో గాయపడి చికిత్స పొందుతున్న యువకులకు ఎంపీ పరామర్శ





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఎంపీ వల్లభనేని బాలశౌరి మానవత్వం చాటుకున్నారు. ఆదివారం జనసేన పార్టీలో చేరేందుకు ఎంపీ బాలశౌరి ర్యాలీగా వెళ్తున్న క్రమంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు జనసేన యువకులను ఎదురుగా వచ్చిన కారు ప్రమాదవశాత్తు కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో చుండూరి త్రినాథ్ అనే యువకుడు తీవ్రంగా గాయపడగా.. పవన్ అనే మరో యువకుడు స్వల్పంగా గాయపడ్డాడు. బాధితులు ప్రస్తుతం గుంటూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎంపీ బాలశౌరి మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఇద్దరు బాధితులను పరామర్శించారు. ఘటనకు జరిగిన తీరు గురించి తెలుసుకున్నారు. అనంతరం బాధితుల తల్లిదండ్రులతో మాట్లాడి వారికి ధైర్యంగా ఉండాలని, అన్నీ తాను చూసుకుంటానని ఎంపీ బాలశౌరి హామీ ఇచ్చారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్‌తో మాట్లాడి బాధితులకు ఇప్పటి వరకు ఏ విధమైన చికిత్స చేశారు అన్న వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు వైద్యం అందించేందుకు ఆసుపత్రిలో అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయా లేదా అని ఆరా తీశారు. దీనిపై స్పందించిన సూపరింటెండెంట్ బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని ఆసుపత్రిలో అన్ని వసతులు ఉన్నాయని తెలిపారు. వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని ఎంపీ బాలశౌరి సూచించారు. ఎప్పటికప్పుడు బాధితుల చికిత్సకు సంబంధించి తనకు వివరాలు తెలియజేయాలని కోరారు. చివరిగా మీడియాతో మాట్లాడిన ఎంపీ బాలశౌరి.. ర్యాలీ పాల్గొన్న యువకులు రోడ్డు ప్రమాదంలో గాయపడిన సంఘటన తనని కలచివేసిందని ఎంపీ బాలశౌరి అన్నారు. బాధితుల కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎంపీ తెలియజేశారు.

**బాధితులకు రూ.70వేల ఆర్థిక సాయం..** ఆపదలో ఉన్న ప్రతి జనసేన కార్యకర్తకు అండగా ఉంటానని ఎంపీ బాలశౌరి హామీ ఇచ్చారు. ర్యాలీలో గాయపడిన చుండూరి త్రినాథ్, పవన్ కుటుంబ నేపథ్యం అంతంతమాత్రం కావడంతో ఎంపీ బాలశౌరి వారికి వైద్య ఖర్చుల నిమిత్తం త్రినాథ్‌కు రూ.50వేలు, పవన్‌కు రూ.20వేలు సాయం చేశారు. అవసరమైతే బాధిత యువకులను ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటానని వారికి భరోసా కల్పించారు. ఎలాంటి ఇబ్బంది వచ్చిన తాను ఎల్లవేళలా అండగా ఉంటానని ఎంపీ బాలశౌరి బాధితుల తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. ఎంపీ వెంట గుంటూరు తూర్పు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జి నేరెళ్ల సురేష్, జిల్లా ఉపాధ్యక్షురాలు బిట్రగుంట మల్లిక, 56 డివిజన్ అధ్యక్షులు పులిగడ్డ నాగేశ్వరరావు, నగర కార్యదర్శి త్రిపురకుమార్, నాయకులు బండి ప్రభు, బిట్రగుంట శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# నిజం గెలవాలి..

● టీడీపీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన నారా భువనేశ్వరి.






**మంగళగిరి,కలంకౌంటర్ :** మంగళగిరి నియోజకవర్గం, దుగ్గిరాల మండలం, దుగ్గిరాల గ్రామంలో కార్యకర్త కన్నెగంటి మోహనరావు కుటుంబానికి భువనేశ్వరి పరామర్శ. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక గుండెపోటుతో 2023సెప్టెంబర్ 12న మృతిచెందిన మోహనరావు. మోహనరావు చిత్రపటానికి నివాళులు అర్పించిన భువనేశ్వరి మోహనరావు కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న భువనేశ్వరి. మోహనరావు కుటుంబ సభ్యులకు రూ.3లక్షల చెక్కు ఇచ్చి ఆర్థికసాయం చేసిన భువనేశ్వరి.

# నిజమైన అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తా... బూరగడ్డ





**బంటుమిల్లి,కలంకౌంటర్ :** నిజమైన అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తా అని, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఉపసభాపతి బూర గడ్డ వేదవ్యాస్ అన్నారు. మంగళవారం వేదవ్యాస్ బంటుమిల్లిలో పర్యటించారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం జనసేన ఉమ్మడి ప్రభుత్వం రావడ ఖాయం అని ఈ ఎన్నికల్లో తాను పోటీ చేయనున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ సందర్భంగా తాను మల్లేశ్వరం ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ బంటుమిల్లి పట్టణంలో పలువురిని కలిశారు అలాగే తన హయాంలో చేసిన అభివృద్ధి పనులను ఈ సందర్భంగా ఆయన పర్యటించి పరిశీలించారు. తెలుత బంటుమిల్లి బస్టాండ్ ను పరిశీలించారు. అనంతరం డిగ్రీ కళాశాల సందర్శించారు విద్యార్థులతో మాట్లాడారు అలాగే రక్షిత మంచినీటిపథకం చెరువులను పరిశీలించారు.రాబోయే టీడీపీ జనసేన పార్టీల ఆధ్వర్యంలో పెడన నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని, ప్రజలుతనకు అవకాశం ఇవ్వాలనిబూరగడ్డ వేదవ్యాస్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పర్యటన అనంతరం పాత్రికేయ సమావేశం నిర్వహించారు . మీడియా సమావేశంలో వేదవ్యాస్ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో చేసిన అభివృద్ధి తప్ప, ఆ తర్వాత అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడి లాగా ఉందన్నారు. బంటుమిల్లి లో విస్తృతంగా పర్యటించిన వేదవ్యాస్ దారి పొడుగునా ప్రజల్ని పలకరిస్తూ వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. తాను ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో బంటుమిల్లిలో బస్టాండ్ ను నిర్మించడం జరిగిందని ఆ తర్వాత బస్టాండ్ అభివృద్ధి జరగకపోవడం, నిర్లక్ష్యానికి గురి కావడం బాధాకరంగా ఉందన్నారు. కనీసం బస్టాండ్ కు వెళ్లే దారి సిమెంటు రోడ్డు కూడా లేకపోవడం చూసి ఆవేదన వ్యక్తం చేశారు. బంటుమిల్లి బస్టాండ్ వల్ల చుట్టుపక్కల 50 నుండి 60 గ్రామాల ప్రజలకు ఉంటుందని తాను ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో బస్టాండ్ ను నిర్మించడం జరిగిందని, రాను రాను బస్టాండు శిధిలావస్థకు రావడం చూస్తుంటే బాధాకరంగా ఉందని అన్నారు. ఒకప్పుడు మల్లేశ్వరం నియోజకవర్గంలో బంటుమిల్లి కేంద్రంగా తాను అభివృద్ధి పనులు చేశానని, భవిష్యత్తులో తాను మళ్ళీ అధికారంలోకి వస్తే పెడన నియోజకవర్గ రూపురేఖలు మార్చి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని అన్నారు. తీర ప్రాంత గ్రామాలైన బంటుమిల్లి , కృత్తివెన్ను మండలాల్లో తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొని ఉందని కలుషిత నీటి వల్ల ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నారని మంచినీటి ఎద్దడి నివారణకు కృషి చేస్తానని వేదవ్యాస్ తెలిపారు.రాబోయే టీడీపీ జనసేన ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రజలు స్వర్ణ యుగాన్ని చూస్తారని అభివృద్ధి, సంక్షేమం, భద్రత , లక్ష్యంగా పెడన నియోజకవర్గం లోని రహదారులను తీర్చిదిద్దుతానని, ప్రజలకు మంచినీటి వసతి కల్పిస్తానని వేదవ్యాస్ అన్నారు.తాను మళ్లీ వస్తానని ప్రజా సమస్యలు తప్పక పరిష్కరిస్తా అని టిడిపి బూరగడ్డ వేదవ్యాస్ ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం రాగానే అభివృద్ధి అంటే ఏంటో మరోసారి చేసి చూపిస్తామన్నారు. ఈ ప్రభుత్వానికి అభివృద్ధి మీద సరైన దృష్టి లేదన్నారు.ఈ కార్యక్రమం లో తెలుగుదేశం కార్యకర్తలు, జనసేన కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నాటక రంగంలో వీధి నాటకాలది ప్రత్యేక స్థానం

● నేటి నుంచి భారత్ రంగస్థల మహోత్సవ్ వేడుకలు ● నాటక రంగం కు పూర్వ వైభవం రావాలంటే నాటక మహోత్సవాలు పెద్ద సంఖ్యలో నిర్వహించాలి● కందుకూరి, గురజాడ,జే చిలకమర్తి తదితర ఎందరో మహానుభావుల వల్లే నాటక రంగం ఉన్నత శిఖరాలకు చేరుకుంది ● పూర్వం ప్రజానీకానికి నాటకమే ప్రధాన వినోద సాధనం● నాటకరంగ ప్రోత్సహకానికి ప్రభుత్వం సహకారం ఎంతో ఉంది ● ఇతర రాష్ట్రాల సంస్కృతిపై అవగాహనకు భారత్ రంగస్థల మహోత్సవ్ వేడుకలు ఎందో దోహదపడతాయి ● రాష్ట్ర ప్రణాళికా సంఘ ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు



**విజయవాడ,కలంకౌంటర్ :** నాటక రంగం పూర్వవైభవం సంతరించుకోవాలంటే ఇలాంటి నాటక మహోత్సవాలు పెద్ద సంఖ్యలో జరగాలని రాష్ట్ర ప్రణాళికా సంఘ ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. న్యూ ఢిల్లీకి చెందిన నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో 25వ భారత్ రంగస్థల మహోత్సవాలు 2024 అంగరంగ వైభవంగా మంగళవారం ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 1 నుంచి 21 వరకు దేశవ్యాప్తంగా 15 నగరాల్లో నిర్వహిస్తున్న నాటక మహోత్సవాల్లో భాగంగా మంగళవారం నుంచి ఆదివారం వరకు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఎంపికచేయబడిన అత్యుత్తమ ఆరు నాటికల ప్రదర్శన ప్రతి రోజూ సాయంత్రం ప్రదర్శించనున్నారు. నాటక మహోత్సవాల ప్రారంభోత్సవానికి రాష్ట్ర ప్రణాళికా సంఘ ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతూ మన విజయవాడలో రెండవ సారి జాతీయ స్థాయి నాటక మహోత్సవాలు జరగటం అభినందనీయమన్నారు. పూర్వం మన జీవితంలో నాటికలు ఒక భాగమైపోయాయన్నారు. శ్రమజీవుల కష్టాలను మరిచి ఉల్లాసపరటానికి, మంచి వైపు మానవుడు పయనించటంలో భాగంగా ఆలోచనాత్మక నాటికలు నిలిచాయని మల్లాది విష్ణు గుర్తుచేశారు. మన రాష్ట్రంలో నాటక రంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి విశేష కృషి చేస్తున్నారన్నారు. సామాజిక అంశాలతో కూడిన నాటకాల వలన ఆలోచనా శక్తి పెరుగుతుందని రాష్ట్ర ప్రణాళికా సంఘ ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. కందుకూరి, గురజాడ, చిలకమర్తి తదితర మహానుభావులు అప్పటి సమాజంలో నెలకొన్న సమాజ రుగ్మతలపై కలం ఎక్కుపెట్టారని, తమ నాటికల ద్వారా ఆలోచింపచేసి వారిని ఆలోచనాత్మకంగా అడుగులు వేసే విధంగా పరివర్తన తీసుకురాగలిగారన్నారు. నాటక రంగాన్ని ఉన్నత స్థితికి తీసుకువెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భారత్ రంగస్థల మహోత్సవ్ ల నిర్వహణతో దేశంలోని ఇతర రాష్ట్రాల సంస్కృతి, సాంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందన్నారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా మన దేశంలో ఆరు దశాబ్దాలకు పైగా విశేష సేవలు అందిస్తున్నదని కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్. కె. శ్రీనివాసరావు అన్నారు. మన దేశంలో నాటక రంగానికి చేయుత నందించటంలో, నాటక రంగాన్ని ఉన్నత స్థితికి చేర్చటంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా పాత్ర ఎనలేనిదన్నారు. నాటికలు మన సంస్కృతిని ప్రతిబింబిస్తాయని తెలిపారు. ఇప్పటికీ నాటికలకు ఆదరణ లభిస్తుండటం ఎంతో అభినందనీయమన్నారు. ప్రేక్షకులను ఆకట్టుకునే నాటికలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. అప్పుడే నాటక రంగానికి పూర్వ వైభవం సిద్ధిస్తుందన్నారు. భారత్ రంగస్థల మహోత్సవ్ లో భాగంగా మొదటి రోజు ఎన్. డీ. రిపర్టరీ కంపెనీ, న్యూఢిల్లీ వారి మైరి మె కా సె కహూ నాటకంను ప్రదర్శించారు. ఈ నాటకానికి ఆధారం విజయదాన్ దేతా రాసిన దువిధ కథ. సమాజంలో స్త్రీ తన కోరికలు, భావోద్వేగాలు, సామాజిక నిబంధనల మధ్య పడే సంఘర్షణే ప్రధాన ఇతివృత్తింగా తీసుకుని నాటకం ప్రదర్శించారు. నాటకం ఆద్యంతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ముందుగా ముఖ్య అతిధులను శాలువాలు, మెమోంటోలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా రెస్పెక్టరీ చీఫ్ రాజేష్ సింగ్, సాంస్కతిక శాఖ డైరక్టర్ మల్లికార్జునరావు, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా అసిస్టెంట్ ప్రోఫెసర్ వివేక్ తదితరులు పాల్గొన్నారు.

# మోటూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, విద్యుత్ సబ్ స్టేషన్, సొసైటీ బ్యాంక్ భవనాలు ప్రారంభించిన ఎమ్మెల్యే కొడాలి నాని



**గుడివాడ రూరల్,కలంకౌంటర్ :** గుడివాడ రూరల్ మండలం మోటూరు గ్రామంలో నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న గ్రామ సచివాలయం, సొసైటీ బ్యాంకు భవనం మరియు విద్యుత్ సబ్ స్టేషన్ ను ఎమ్మెల్యే కొడాలి నాని మంగళవారం ప్రారంభించారు. తొలుత గ్రామ పొలిమేరలో ఎమ్మెల్యే నానికు వైఎస్సార్సీపీ శ్రేణులు, గ్రామస్తులు గజమాలలతో ఘన స్వాగతం పలికారు. భగీరథ మహర్షి, స్వర్గీయ వంగవీటి మోహన రంగా విగ్రహాలకు నివాళులర్పించిన ఎమ్మెల్యే కొడాలి నాని, ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే నానికు చిన్న పెద్ద అనే వ్యత్యాసం లేకుండా ప్రతి ఒక్కరు ఆత్మీయ స్వాగతం పలుకగ మహిళలు మంగళ హారతులు ఇవ్వగ, టపాసులు కాలుస్తూ యువత సందడి చేశారు. ప్రభుత్వ కార్యాలయాల ప్రారంభోత్సవ అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ కరోనా వల్ల నష్టపోయిన, ఆర్థిక ఇబ్బందులు తలెత్తిన నాలుగు సంవత్సరాల తొమ్మిది నెలల వైఎస్ఆర్సిపి పాలనలో అనేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామని ఎమ్మెల్యే కొడాలి నాని అన్నారు. స్వతంత్రం వచ్చిన 75 సంవత్సరాల్లో ఏ ముఖ్యమంత్రి చెయ్యని విధంగా పేదల ఇల్లు , మౌలిక వసతులు కోసం లక్ష 20వేల కోట్లు ఖర్చు చేసిన ఘనత సీఎం జగన్ దేనని కొనియాడారు. ఒక గుడివాడలోనే 5వెలు కోట్లు ఖర్చు అయ్యాయన్నారు









Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com